క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. మాదన్నపేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా ఎంపీ అసదుద్దీన్ జన్మదిన వేడుకలు


శుభాకాంక్షలు తెలుపుతున్న దిపేశ్ రాజ్ వర్మ

చార్మినార్: హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జన్మదినం సందర్భంగా పాతబస్తీకి చెందిన మజ్లిస్ పార్టీ నాయకుడు ఆర్.దిపేశ్ రాజ్ వర్మ దారుస్సలాంలో ఆయనను కలిసి బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదానం..

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జన్మదినం సందర్భంగా మజ్లిస్ పార్టీ నాయకులు, షాలిమార్ చానల్ సీఈఓ కృష్ణ శనివారం రక్తదానం చేశారు. అనంతరం పేదలకు ఆహార పదార్థాలను అందజేశారు.

'కవివారం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'కవివారం' పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉద్యమం సంఘటిత స్ఫూర్తిని నింపిందన్నారు. కవుల కోసం ఒక వారాన్ని పెట్టుకోవడం ఎంతో శుభ సూచికమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు నందిని సిద్దారెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులు నాళేశ్వరం శంకరం, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల అధ్యక్షులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

చార్మినార్: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్.ఆనంద్‌రావు శనివారం మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకొన్నారు. గౌలిపురాలో సంబరాలు నిర్వహించిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి గాంధీ భవన్‌కు చేరుకొని అక్కడ కూడా మిఠాయిలు పంచిపెట్టారు.

చార్మినార్‌లో..

తెలంగాణలో కూడా కాంగ్రెస్ విజయం ఖాయమని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల ఆయన శనివారం చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలంగాణలో కూడా కాంగ్రెస్‌దే విజయం..

అబిడ్స్: కర్ణాటక తరహాలో తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బేగంబజార్ నుంచి గాంధీభవన్ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేకు మిఠాయిలు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునందన్ యాదవ్, పరీక్షిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాంబాగ్‌లో..

జాంబాగ్‌లో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున సంబరాలు చేపట్టింది. ఏ–బ్లాక్ అధ్యక్షుడు సీకే.మూర్తి కార్యాలయంలో మిఠాయిలు పంచిపెట్టారు. నర్సింగ్‌రావు, రమేష్ గౌడ్, నర్సింహా, కిషన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


రేతిబౌలి రింగ్ రోడ్డు వద్ద..

రేతిబౌలిలో..

గోల్కొండ: కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రేతిబౌలి రింగ్ రోడ్డు వద్ద విజయ సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురకుల కృష్ణ, పరమానందం, చంటిబాబు, ఎం.ఆర్.రెడ్డి, గిరి, హమీద్, వినోద్‌సింగ్, అశోక్‌గౌడ్ తదితరులున్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: కర్ణాటక ఫలితాలే తెలంగాణలో రానున్న ఎన్నికల్లో పునరావృతం కానున్నాయని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ అన్నారు. కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో వెంకటేష్ నేతృత్వంలో శనివారం లాల్ దర్వాజా మోడ్ నెహ్రూ విగ్రహం వద్ద బాణా సంచా కాల్చి మిఠాయిలు పంచి విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. సురేష్‌బాబు, చంద్రశేఖర్, శ్రీనివాస్, కృష్ణ యాదవ్, అనూప్, మూసా ఖాసీం పాల్గొన్నారు.


లాల్ దర్వాజా మోడ్ నెహ్రూ విగ్రహం వద్ద..


సంబరాల్లో కేఎస్.ఆనంద్‌రావు తదితరులు


మాణిక్‌రావు ఠాక్రేకు మిఠాయిలు తినిపిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్


జాంబాగ్‌లో .. సీకే. మూర్తి తదితరులు

ఓటర్ల నమోదు పారదర్శకంగా ఉండాలి

నాంపల్లి: 18 ఏళ్లు నిండిన యువతీ యువకుల పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నాంపల్లి నియోజకవర్గం అసెంబ్లీ పోలింగ్ బూత్ అధ్యక్షులతో శుక్రవారం రాత్రి లక్డికాపూల్‌లోని మారుతీ గార్డెన్స్‌లో సమావేశం జరిగింది. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కోరారు. బోగస్ ఓట్లు, డబుల్ ఓట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జూన్ 3, 4వ తేదీల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు చదివిన యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి సందీప్, ఉపాధ్యక్షులు సుమన్‌చంద్ర, కార్యదర్శి భుజందర్‌రావు, సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాహుల్ చంద్ర, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబేద్కర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి విజయ్ సింగ్, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాంపల్లి అసెంబ్లీ ఫుల్‌టైమర్ పద్మజారెడ్డి, పార్లమెంట్ ఫుల్‌టైమర్ శివకుమార్, నగర అధికార ప్రతినిధి రవికుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కల్పించాలి


ఆకట్టుకున్న నృత్య రూపకం

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందని ప్రముఖ నృత్యగురువు భాగవతుల సేతూరామ్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో జ్ఞాన సరస్వతి డ్యాన్స్ అకాడమీ 23వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వైకుంఠ నారాయణమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమూరి విజయ్‌కుమార్, సంస్థ వ్యవస్థాపకురాలు వాణిరమణ, కోశాధికారి వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తలసానికి ఆహ్వానం


మంత్రిని ఆహ్వానిస్తున్న మంత్రి శేషాచార్యులు, కార్పొరేటర్ శంకర్‌యాదవ్ తదితరులు

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఈ నెల 16న జరిగే స్వామివారి రథోత్సవానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా రావాల్సిందిగా ఆహ్వానించినట్లు ఆలయ ప్రతినిధి శేషాచార్యులు, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16న నిర్వహించే రథోత్సవ వేడుకలకు హాజరై ప్రారంభించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పూరీజగనాథ్ రథోత్సవం తరహా భారీ ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నామన్నారు. నూతనంగా రథాన్ని తయారు చేయించడం జరిగిందని, ఇక నుంచి ప్రతి యేటా జరిగే బ్రహ్మోత్సవాల్లో స్వామివారి కల్యాణం, రథోత్సవం, ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు.

ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి


లక్ష్మీనారాయణకు పురస్కారాన్ని అందజేస్తున్న పలువురు వక్తలు

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. శనివారం రవీంద్రభారతిలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణకు సుజాతమ్మ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం, సినీ విభావరి, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడు విరూపాక్ష స్వామి, రచయిత మురళీమోహన్‌రాజు, నిర్వాహకులు రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: ఈనెల 29వ తేదీ నుంచి కోవెల రంగనాయకస్వామి ప్రాంగణంలో లక్ష్మీ నరసింహ స్వామి సమేత గోదారంగనాథ స్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు సోమారపు జనార్దన్ అన్నారు. శనివారం నానల్‌నగర్ తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాయకస్వామి ఆలయంలో దీనికి సంబంధించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర దేవాదాయ శాఖ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సూచనలు, ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ పాలెం మనోహర్‌శర్మ, దేవీ ఉపాసకులు రాజు వస్తాద్‌ల సహకారంతో ఈ భవ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 29, 30, 31వ తేదీల్లో పూజా కార్యక్రమాలు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, అశోక్ కుమార్, జగన్నాథం, విజయ్ తదితరులున్నారు.

దేవర కరుణాకర్ స్ఫూర్తితో సమాజ సేవ

గోల్కొండ: గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని బీజేపీ సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ వారు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత కార్పొరేటర్ జనహిత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించే వారిని ముందు కూడా ఈ కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. యువకుల్లో చైతన్యం తీసుకురావడానికి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సేవా కార్యక్రమాలు పార్టీలకు అతీతంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వంశీ, యాదవ్, కిసాన్ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు మాణిక్ ప్రభు, లక్ష్మణ్ యాదవ్, మధుసుదన్‌యాదవ్, నామ యాదగిరి, అశ్విన్ తదితరులున్నారు.


ఓటరు నమోదు కార్యక్రమంలో దేవర శ్రీనివాస్, దేవర వంశీ తదితరులు

ఉల్లాసంగా 'కవి సమాగమం'



సుల్తాన్‌బజార్: మైత్రి సంస్థ (అట్లాంటా యుఎస్ఏ) సౌజన్యంతో నవ్య సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో జరిగిన కవి సమాగమం కార్యక్రమంలో ప్రఖ్యాత గేయ కవి, సినీ కవి డాక్టర్ వడ్డెపల్లి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మండె గ్రీష్మంలో మలయ మారుతంలా కవి సమాగమం సాగిందన్నారు. మైత్రి సంస్థ వ్యవస్థాపకులు చిలివేరు కాకతీయ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మైత్రి, జనని సంస్థల ఆధ్వర్యంలో ఒక కవికి పురస్కారం ప్రతి ఏడాది అందిస్తామన్నారు. కళలు, కవితలు మనిషికి మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రముఖ రచయిత్రి స్వాతి శ్రీపాద మాట్లాడుతూ.. భాషను చిన్నారులకు సరైన రీతిలో నేర్పించడం పెద్దల బాధ్యత అని గుర్తుచేశారు. ఆచార్య టి.గౌరి శంకర్, రాప్రోలు సుదర్శన్, శైలజ, మాధవ్‌రావు, కామేశ్వర్‌రావు, రంగయ్య, రామకృష్ణారావు, సుందరయ్య, సాధన నర్సింహాచార్య, భానుప్రకాష్, శారద సాయి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మేరు కులస్తులకు సీట్లు కేటాయించండి


భారీ ర్యాలీ నిర్వహించిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికంగా సీట్లు కేటాయించాలని రాష్ట్ర మేరు దర్జీ యువజన సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కర్ణాటక తరహాలో తెలంగాణలో కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. శనివారం పాతబస్తీ నుంచి గాంధీభవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను కలిశారు. మేరు కులస్తులకు అధిక స్థానాలు కేటాయిస్తే తాము విజయం సాధిస్తామని ఆయన తెలిపారు. నగరంలోని ఎల్బీనగర్, అంబర్‌పేట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో మేరు కులస్తులకే టికెట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గోనె సాలమన్ రాజ్‌ను ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలి



సుల్తాన్‌బజార్: క్రైస్తవ కమ్యూనిటీతో సత్సంబంధాలు కలిగి ఉండడంతో పాటు క్రైస్తవ కమ్యూనిటీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాలమన్ రాజ్‌కు ఎమ్మెల్సీ పదవికి నామినేట్ చేయాలని పాతబస్తీ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ సభ్యులు జోసెఫ్ ఇమ్మాన్యుయేల్, జయకుమార్ జాకీయస్, బి.సాలమన్, ఎన్.జ్ఞానప్రకాష్ మాట్లాడారు. అన్ని మతాలకు సమాన హక్కులు కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో పాస్టర్లు కె.వెంకటేష్ పాల్, సంపత్‌కుమార్, జాషువా, జాన్‌మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

గోల్కొండ: షేక్‌పేట్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని సమతా కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు సుల్తాన్ తదితరులున్నారు.

'కర్ణాటక ప్రజలు బీజేపీకి తగిన బుద్ధి చెప్పారు'


చంద్రమోహన్‌గౌడ్

గౌలిపురా: కర్ణాటక ప్రజలు బీజేపీకి తగిన బుద్ధి చెప్పారని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.చంద్రమోహన్ గౌడ్ అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజలకు అనుకూలంగా పాలన సాగించాలన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలు రక్తాన్ని పీల్చి దేశ సంపదనంతా కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు అంటగట్టి, అదుపు లేని ధరలను పెంచుతూ ప్రజల నడ్డి విరిచి ప్రశ్నించే గొంతులను నిర్బంధించడం, రైతు చట్టాలను తెచ్చి ఎంతో మంది రైతుల ఉసురు తీసిన కేంద్రంలో ఉన్న బీజేపీకి ఈ కర్ణాటక ప్రజా తీర్పు రానున్న ఎన్నికలకు ఇది ఒక రెఫరండమే అన్నారు. ఈరోజు కర్ణాటకలో ప్రజలు ఇచ్చిన విధంగానే దేశంలోని ప్రతి రాష్ట్రంలో ఇదే తీర్పుతో బీజేపీ గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

గోల్కొండ: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కిరాణా స్టోర్ లేన్‌లో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ పనులు మరీ నెమ్మదిగా జరుగుతున్నాయని, ఈ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వెంటనే పూర్తి చేయాలని, రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను వెంటనే తరలించాలని ఆయన సూచించారు. అదే విధంగా మురుగునీరు రోడ్లపై రాకుండా చూడాలని ఆయన అన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు అబ్బాస్ తదితరులున్నారు.

సన్మానం


సంగీత దర్శకుడు సాలూరి వాసురావును సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: సంగీతం మనస్సుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తుందని పలువురు ప్రముఖులు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పిపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు సాలూరి వాసురావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు, ట్రస్ట్ అధ్యక్షుడు వాసురావు, ఉపాధ్యక్షుడు అశ్విని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న పలువురు రచయితలు

గన్‌ఫౌండ్రీ: ఒంటరి మహిళ జీవితం ఎంతో వివక్షతతో కూడుకొని ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో హస్మిత ప్రచురణలు ఆధ్వర్యంలో బండారు. విజయ, పి.జ్యోతి రచించిన స్వయం సిద్ధ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు సి.మృనాళిని మాట్లాడుతూ.. ఒంటరి మహిళ జీవితాల గురించి అక్కడక్కడ రెండు వ్యాఖ్యలు తప్పా వారి పక్షాణ నిలిచిన సాహిత్యం పెద్దగా లేదన్నారు. అటువంటి సమయంలో ఒంటరి మహిళ జీవితంలోని విభిన్న కోణాలను ప్రపంచానికి తెలియజెప్పేలా పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా రచయితలు డాక్టర్ చెల్లపల్లి స్వరూపరాణి, రుక్మిణిరావు, షీలా సుభద్రదేవి, పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

చాంద్రాయణగుట్ట: యువకుడు అదృశ్యమైన ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై ఎం.సీతాపతి తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ నూరీనగర్‌కు చెందిన ఫర్జానా బేగం చిన్న కుమారుడు షేక్ జుబేర్(22) కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 30న ఉదయం 11 గంటలకు స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన జుబేర్ తిరిగి ఇంటికి రాలేదు. అతని ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.